# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 134 VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: శుక్రవారం 06 జూన్ 2026








2వ పేజీలో...




2వ పేజీలో...

## తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోండి ఉద్యమకారుల కమిటీకి సిపిఐ సూచనలు



**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** గురువారం రాష్ట్ర సెక్రటేరియట్‌లో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో, జరిగిన అఖిలపక్ష సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తరఫున రాష్ట్ర సహాయ కార్యదర్శులు, తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ టి నరసింహ,పాల్గొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సీపీఐ, ఉద్యమకారుల ఆకాంక్షలు మరియు వారి కుటుంబాల రక్షణ కోసం ఈ క్రింది ప్రధాన ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకెళ్లింది.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం, మరియు ఆర్థిక సాయం అందేలా చూడాలి. ఇప్పటివరకు సాయం అందని మిగిలిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలి.ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువకులు, మరియు ఉద్యమకారులపై నమోదైన అన్ని రకాల పోలీస్ కేసులను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ఎత్తివేయాలి.వయసు పైబడిన, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యమకారులకు నెలవారీ గౌరవ వేతనం అందించాలి. అలాగే వారి కుటుంబ సభ్యులందరికీ ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం ఆరోగ్య కార్డులు, కల్పించాలి.

కమ్యూనిస్టులు మరియు ఇతర సామాజిక శక్తులు చేసిన సాయుధ పోరాటాలు, మలిదశ ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. గన్‌పార్క్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో అమరవీరుల జ్ఞాపకార్థం స్మారక చిహ్నాలను నిర్మించాలి. తెలంగాణ సిద్ధించి ఒకటిన్నర దశాబ్దం కావస్తున్నా.. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు సామాజిక సమానత్వం అనే ఉద్యమ ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. ఉద్యమకారులను గౌరవించుకోవడం అంటే ఆ ఆకాంక్షల సాధన కోసం పనిచేయడమే."ఉద్యమకారుల కమిటీ కేవలం నామమాత్రంగా కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల నుంచి వినతులు స్వీకరించి ప్రభుత్వానికి త్వరితగతిన నివేదిక సమర్పించాలని సీపీఐ డిమాండ్ చేస్తోంది.

## గుడ్డెం దొడ్డి రిజర్వాయర్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి

**ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ.సంపత్**



**(సమయం ప్రతినిధి గద్వాల) :** ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా గద్వాల నియోజకవర్గంలోని గుడ్డెం దొడ్డి రిజర్వాయర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందర్శించి ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీహరి ప్రజాప్రతినిధులు, అధికారుల తో కలిసి ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ సంపత్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రితో కలిసి హెలికాప్టర్‌లో వెళ్ళి కొల్లాపూర్‌లోని సోమశిల ప్రాజెక్టును సందర్శించడం జరిగింది.అలంపూర్ నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న నీటి పారుధాల ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంపత్ కుమార్ కోరడం జరిగింది. మల్లమ్మ కుంట రిజర్వాయర్ను ఏర్పాటు చేసి అలంపూర్ నియోజకవర్గం లోని రైతులకు నీటి కష్టాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంపత్ కుమార్ కోరడం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రితో కలిసి హెలికాప్టర్‌లో వెళ్ళి కొల్లాపూర్‌లోని సోమశిల ప్రాజెక్టును సందర్శించడం జరిగింది.అలంపూర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నీటి పారుధాల ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంపత్ కుమార్ కోరడం జరిగింది. మల్లమ్మ కుంట రిజర్వాయర్ను ఏర్పాటు చేసి అలంపూర్ నియోజకవర్గం లోని రైతులకు నీటి కష్టాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సంపత్ కుమార్ కోరడం జరిగింది. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ , కిసాన్ శాల అధ్యక్షులు నాగరాజు RDS మాజీ చైర్మన్ తనగల సీతారామ రెడ్డి కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లిన కొన్ని విషయాలు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణాన్ని ఒక టీఎంసీ కి తగ్గకుండా నిర్మించడం.మల్లమ్మ గుడి నిర్మాణం కొరకు 500 ఎకరాల భూసేకరణ వల్ల నష్టపోయే రైతులకు ఎకరాకు 22 లక్షల రూపాయల చొప్పున నష్ట పరిహారం అందించడం.ఆర్డీఎస్ మెయిన్ కెనాల్ 75 కిలోమీటర్ల నుంచి 108 కిలోమీటర్లకు కాల్వ సామర్థ్యాన్ని పెంచడం.కృష్ణ తుంగభద్ర ఆయకట్ట రైతులతో మాట్లాడి సమన్వయపరిచేందుకు ఒక ప్రభుత్వ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం.తుంగభద్ర బోర్డు పరిధిలోకి ఆర్డీఎస్ కాలవని చేర్చడం లాంటి పలు అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి , గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గద్వాల జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య , రాష్ట్ర అధికార ప్రతినిధి కౌన్సిలర్ షేక్షావల్లి ఆచారి అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కొమ్ము కుమార్ RDS మాజీ చైర్మన్ తనగల సీతారామ రెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా గ్రంధాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ గంజిపేట శంకర్ గారు, మాజీ టెలికాంబోర్డు మెంబర్ ఇస్మాయిల్, కిసాన్ సెల్ అధ్యక్షులు ఇస్మాయిల్, అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల మండల అధ్యక్షులు మహిళా నాయకురాలు నాగ శిరమణి, సులోచన, కౌన్సిలర్లు మాజీ ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# సంపాదకీయం

## నైరాశ్య యువత నవీన తిరుగుబాటు

'మాట మాటకు మందు దూరంలా/ మేం సాగుతాం/ మేం రేగుతాం'.. అంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ/ బొద్దింకల జనతా పార్టీ) 'ఝంఝానిల షడ్జధ్వానం' చేసింది. సీజేపీ ఒక డిజిటల్ దృగ్విషయం. నిరుద్యోగ యువతను 'పరాన్న జీవులు', 'బొద్దింకలు'తో పోలుస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రజ్వరిల్లిన ఆన్‌లైన్ ధిక్కారమది. కనుకనే అపూర్వ సంచలనం సృష్టించింది. అయితే ఆ సంచలనానికి ప్రతిస్పందనలు చాలావరకు స్పష్టంగా కనిపిస్తున్న ఒక సామాన్య సత్యాన్ని గమనించనే లేదు! సీజేపీ ఒక సంప్రదాయ రాజకీయ పార్టీ కాదు. అది ప్రజానీకం కంటే ఎక్కువా కాదు, తక్కువా కాదు. అది ఒక సమాజమూ కాదు. ఒక గుంపు కూడా కాదు, అదొక భావోద్వేగాల సముదాయం. ఒక ఉద్యమ స్థాయికి చాలా చాలా దూరంగా ఉన్నది. అది కేవలం ఒక ప్రభంజన సందర్భం. ఎటువంటి ప్రభంజనమది? 'ఒక్క క్షణంలో/ మనస్సులో స్మృతి/ తటిన్మణి'పించిన ప్రభంజనమది. 'మతి వికాసిస్తుంది' సందేహం లేదు. అధికార నియంతృత్వ దాడి నుంచి మన ప్రజా స్వామిక గణతంత్రాన్ని కాపాడుకోవాల్సిన కర్తవ్యాన్ని నిర్దేశించడమే కాకుండా అందుకు అవసరమైన సంకల్పశక్తిని సమకూర్చిన ప్రభంజన క్షణమది. అందుకే అది ముఖ్యమైనది. ఎట్టి పరిస్థితులలోనూ కొట్టివేయకూడనిది. అలా చేయడ మంటే దేశ రాజకీయ వాస్తవాలను విస్మరించడమే అవుతుంది. ఆ ప్రభంజనం ఒక అల కాదు, ఒక రాజకీయ అంతర్వాహిని, ఆగ్రహ రాజకీయ అంతర్వాహిని (అల అనేది పెద్ద శబ్దంతో, కంటికి కనిపించేదిగా, తాత్కాలికమైనదిగా ఉంటుంది. అది త్వరగా విరుచుకుపడి, అంతరిస్తుంది. అలకు భిన్నంగా అంతర్వాహిని అనేది ఉపరితలం కింద నుంచి ప్రభావం చూపే శక్తిమంతమైన, నిశ్శబ్దమైన, స్థిరమైన కదలిక). ప్రాకృతిక ప్రభంజనాలనే కాదు, రాజకీయ, సామాజిక ప్రభంజనాలనూ పట్టుకోవడమనేది అసాధ్యం. సీజేపీ అనే ప్రభంజనాన్ని నియంత్రించాలనేది ఒక మూర్ఖపు ఆలోచన. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఆ ప్రభంజనం దేశ రాజకీయ వాతావరణంలో, పాలనా వ్యవస్థలో ఒక మౌలిక మార్పును ఆశించింది. అటువంటి మార్పును అడ్డుకోవడానికి మొండిగా ప్రయత్నించడం వివేకవంతం కానేకాదు. భారీ మెజారిటీతో అధికారానికి వచ్చిన ప్రభుత్వాలు తమ పదవీ మధ్యకాలంలో సంక్షోభాల పాలవడం ఒక సాధారణ రాజకీయ పరిణామం. ఊహించని రీతిలో నిరసనోద్యమాలు ప్రజ్వరిల్లి అధికారపు చీకటి కోణాన్ని బహిర్గతం చేస్తాయి. 1973–74లో గుజరాత్, బిహార్ ఉద్యమాలు, 1983లో అసోం ఉద్యమం, 2012లో అన్నాహజారే ఉద్యమం, 2021లో కిసాన్ మోర్చా ఉద్యమం మొదలైనవన్నీ అజేయంగా కన్పించిన ప్రభుత్వాలను సవాల్ చేశాయి.. మార్పును సాధించాయి. ప్రతిపక్షాలు నిస్తేజం కావడంతో విద్యార్థులు, యువజనుల చొరవతో ఆ ఉద్యమాలు నిర్వహించి మార్పులు సాధించారు. ఆశయం దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం కూడా తొలి పరిశీలనలో అదే రీతి ఉద్యమంగా కన్పిస్తోంది. ఈ 'బొద్దింకల' ఉద్యమం అపూర్వ ప్రజా చైతన్యాన్ని సృష్టించడంలో చారిత్రకంగా ఇతర సమాంతర ఉద్యమాల కంటే మరింత ప్రభావశీలమైనది. అయితే ఆచరణీయమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రభవింపజేసేందుకు అవసరమైన శక్తిసామర్థ్యాలు దానికి కొరవడ్డాయి. ఎందుకని? ఈ డిజిటల్ ప్రతిఘటనలో పాల్గొన్నవారు చాలావరకు నిజ జీవిత రాజకీయ కార్యాచరణలో పాల్గొనడానికి సంసిద్ధంగా ఉన్న కార్యకర్తలు కారు.

కాక్రోచ్ జనతా పార్టీ ప్రారంభదశలో ఉన్నది. ప్రభావవంతమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని సృష్టించగల స్థితికి చాలా దూరంలో ఉన్నది. దానికొక సంస్థాపకుడు ఉన్నాడు. అయితే ఆ వ్యవస్థాపకుడు విధిగా ఒక ఆవశ్యక నాయకుడు కాదు. సీజేపీ అనుయాయుల్లో అత్యధికులు కేవలం ప్రేక్షకులు మాత్రమే. ఆందోళనల్లో అనుభవం లేనివారు. కేవలం ఉత్సాహం ఉంటే సరిపోతుందా? నిజ జీవితంలో రాజకీయ కార్యాచరణ కష్టనష్టాలను భరించి లక్ష్యసాధనకు కడదాకా సాగేందుకు సంకల్పించుకునేవారు ఎంతమంది ఉంటారు? పైగా వారు ఒక అనిర్దిష్ట విరోధికి వ్యతిరేకంగా పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులు చేస్తున్నారు. ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యలపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే అవన్నీ ప్రజాస్వామ్య డిమాండ్లు, సందేహం లేదు. పాలకులు వాటిని విస్మరించినప్పుడు (ఇదే జరిగి తీరుతుంది) ఆందోళనకారులు తమ ఉమ్మడి శత్రువును గుర్తిస్తారు. వారి ఫిర్యాదులు ప్రజా డిమాండ్లుగా పరిణమిస్తాయి. సీజేపీ వంటి ప్రతి ప్రజా నిరసనోద్యమపు విశిష్ట లక్షణమది. ఆ ప్రత్యేకతే శక్తిమంతమైన, కార్యసాధక ఉద్యమాల నిర్మాణానికి అవసరమైన ప్రాతిపదికలను నిర్మిస్తుందని అర్జెంటీనా రాజకీయ తత్వవేత్త ఎర్నెస్టో లాక్లా (1935–2014) అన్నారు. నిరంకుశాధికార తత్వం అంతకంతకూ పెరిగిపోతున్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు 'సందిగ్ధ చర్య' (డైలమా యాక్షన్) మార్గాన్ని ఎంచుకోవడం సీజేపీకి మరింత విశిష్టతను సమకూర్చింది. నియంతృత్వ పాలకులను అహింసాత్మకంగా ప్రతిఘటించడంలో హాస్యం, ముందుగా ఊహించవీలులేని పద్ధతిని అనుసరించడం చాలా కీలకమని సెర్బియన్ మేధావి, క్రియాశీలి పోపోవిక్ వాదిస్తారు. సోఫియా ఎ.మెక్ క్లెనెన్‌తో కలిసి ఆమె రాసిన 'ప్రాంక్‌స్టర్స్ వర్సెస్ ఆటోక్రాట్స్' అనే పుస్తకం నిరంకుశ ప్రభుత్వాలను ప్రతిఘటించేందుకు ప్రజా నిరసనోద్యమాలు హాస్యాన్ని, సందిగ్ధ చర్యలను ఉపయోగించుకున్న తీరుతెన్నులను విపులంగా వివరించారు. అటువంటి నిరసనోద్యమాలు నిరంకుశ పాలకులను సందిగ్ధంలో పడవేస్తాయి. ఎదుర్కోలేని సంకటాలను కలిగిస్తాయి. ఉద్యమకారుల సందిగ్ధ చర్యలను అనుమతిస్తే పాలకులు బలహీనులుగా కనిపిస్తారు. వాటిని అణచివేసిన పక్షంలో ప్రజల దృష్టిలో క్రూర, అసంబద్ధ పాలకులుగా నిలుస్తారు. సంప్రదాయ ప్రతిపక్షాలు విఫలమైన చోట ఈ వినూత్న నిరసనలు ప్రభావశీలంగా సఫలమవడం కద్దు. నిరంకుశాధికార పాలనపై పోరుకు బొద్దింకను ఒక మీమ్‌గా చేసిన కాక్రోచ్ జనతా పార్టీని అందుకొక స్పష్టమైన నిదర్శనంగా చెప్పవచ్చు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం

**గుడ్డెం దొడ్డి పంపుహౌస్ ను పరిశీలించిన ముఖ్యమంత్రి.**
**జిల్లా ప్రాజెక్టులపై ఫోటో ఎగ్జిబిషన్, పీపీటి ప్రజెంటేషన్.**
**సీఎం పర్యటనకు భారీ బందోబస్తు.**

**సమయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా చేపట్టిన జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి జలాశయం సామర్థ్యాన్ని 11 లేదా15 టీఎంసీలకు పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రతిపాదనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పంపు హౌస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి జిల్లాకు అవసరమైన నీటి వనరుల సామర్థ్యం పెంపునకు అవసరమైన ప్రతిపాదనలను వివరించారు. ముఖ్యంగా గూడెం దొడ్డి ప్రాజెక్టు 15 టిఎంసిలకు పెంచడం, ర్యాలంపాడు సీపేజీ సమస్యను పరిష్కరించి నాలుగు టీఎంసీల నీటి స్టోరేజ్ నిలువ చేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉందని అలాగే మల్లమ్మ కుంట భూసేకరణ పనులను చేపట్టాల్సిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద గురువారం సాయంత్రం 4:30 ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తదితరులు బొకేలు, మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్డు మార్గంలో జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేజ్1 గుడ్డెం దొడ్డి పంపు హౌస్ వద్దకు చేరుకొని మంత్రులతో కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులపై పిపిటి ద్వారా సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జిల్లా ప్రాజెక్టుల గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో సీఎం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు, మీడియా ప్రతినిధులకు అభివాదం చేస్తూ కరచాలనం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు సీఎంకు పుష్పగుచ్చాలు, శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలతో పాటు, పకడ్బందీ ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారం, సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసినట్లు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్నాటక మంత్రి బోసురాజు, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సీఈ రహీముద్దీన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

**జోగులాంబ గద్వాల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ దానమ్మకి వినతిపత్రం**

(సమయం ప్రతినిధి గద్వాల) : జోగులాంబ గద్వాల్ జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, పీవైఎల్ నాయకులు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ దానమ్మ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రైవేట్ పాఠశాలలు మరియు కోచింగ్ సెంటర్లు సంబంధిత శాఖల నుండి గుర్తింపు, అనుమతులు పొందకుండా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఇటువంటి విద్యా సంస్థల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేని పాఠశాలలు కోచింగ్ సెంటర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందిన మరియు గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్ల జాబితాను



ప్రజలకు వెల్లడించాలని కోరారు. అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు హాలింపాషా, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామనపల్లి రంగస్వామి, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు బిరిల్లి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి భేటీకి నై.. డీఎంకే సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమిలో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం–ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. ఈ కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే – కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# టీఎంసీకి మరో షాక్.. మేయర్ పదవికి దీదీ సన్నిహితురాలు గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా.. తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కృష్ణా చక్రవర్తి నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతగా, మమతకు అత్యంత సన్నిహితురాలిగా ఆమెకు పేరుండటంతో ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఈనెల 10న జిల్లా కేంద్రంలో ఉచిత కంటి చికిత్స శిబిరం



**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ, రామకృష్ణ టాకీస్ రోడ్డు లో గల శోభ ఆప్టికల్ లో ఈనెల 10న బుధవారం నాడు ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పోరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి, ఎనుగొండ,మహబూబ్ నగర్‌కి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు,సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు,ఓటర్ కార్డ్, లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కు 9440454284, 8106333324 నెంబర్ లలో సంప్రదించాలని కోరారు.

# పబ్లిసిటీ పాపు లారిటీ పై ఉన్న శ్రద్ధ పాలమూరు అభివృద్ధిపై లేదు ఎంపీ అరుణ ధ్వజం





**(సమయం ప్రతినిధి గద్వాల) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పబ్లిసిటీ పాపులారిటీపై ఉన్న శ్రద్ధ పాలమూరు జిల్లా అనే అభివృద్ధి చేసే విషయంలో లేదని మహబూబ్నగర్ ఎంపీ శ్రీమతి డి కె అరుణ విమర్శించారు. ఈరోజు గద్వాల జిల్లా SV ఈవెంట్ హాల్‌లో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ సమావేశంలో పాల్గొని, అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

?రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారు. ఉమ్మడి జిల్లా నుంచే ముఖ్యమంత్రి ఉన్నా ఇక్కడి ప్రాజెక్టులు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. జూరాల సేఫ్టీ బ్రిడ్జి, ర్యాలంపాడు, గట్టు లిఫ్ట్ వంటి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కి పబ్లిసిటీ, పాపులారిటీ పై ఉన్న శ్రద్ధ తెలంగాణ, పాలమూరు అభివృద్ధిపై లేదు. హెలికాప్టర్లు పక్కన పెట్టి రోడ్లపై తిరిగితే కదా గుంతలమయమైన రోడ్ల పరిస్థితి అర్థమయ్యేది! అని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది కానీ.. సీఎం, మంత్రులు, కాంగ్రెస్ నేతల ఆస్తులు, ఆదాయం మాత్రం పెరుగుతున్నాయన్నారు.

నాడు BRS, నేడు కాంగ్రెస్‌లో ఉన్న గద్వాల ఎమ్మెల్యే నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదని గద్వాలలో భూ కబ్జాలు, ఇసుక, మట్టి, బియ్యం దందాలు చేస్తూ దోచుకుంటున్నా రన్నారు. ఇంతటి అవినీతిని గద్వాలలో నేనెన్నడూ చూడలేదు. ఎన్నికల్లో డబ్బులు పంచితే సరిపోతుందని ఎమ్మెల్యే అహంకారంతో మాట్లాడుతున్నాడని రైతు భరోసా 15 వేల నుండి 12 వేలకు కుదించి, కేవలం రెండు ఎకరాలకే పరిమితం చేశారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇస్తున్నారు.

గద్వాల జిల్లాను ఏర్పాటు చేయించింది మీ అరుణమ్మ అయితే.. ఇక్కడికి మెడికల్ కాలేజ్ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం అన్నారు. ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలంగాణలో బీజేపీకి అధికారం ఇచ్చేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

ఈ అవినీతి, దోపిడీ చూస్తూ కూర్చుంటే గద్వాలను ఎవరూ కాపాడలేరు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించినప్పుడే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది. ప్రభుత్వ మెడలు వంచి హామీలు అమలు చేయించే విధంగా ప్రజా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. రోడ్లు, పెండింగ్ ప్రాజెక్టులు, నిరుద్యోగం, మహిళల సమస్యలపై మీరు చేసే ప్రతి పోరాటంలో నేను భాగమవుతానని ప్రకటించారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంగారెడ్డి జిల్లా డీఈఓ శ్రీమతి రోహిణిని మర్యాదపూర్వకంగా కలిసిన అఖిల్, బత్తుల విక్రమ్



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈఓ) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి రోహిణి ని అఖిల్ బత్తుల విక్రం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యా ప్రమాణాల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సానుకూలంగా చర్చించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యాశాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, జిల్లా విద్యా రంగ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. డీఈఓ రోహిణి జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, విద్యార్థులు ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా జిల్లా విద్యా రంగ పురోగతికి సంబంధించిన పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

## ఎండల ఎఫెక్ట్.. తెలంగాణలో బీర్ల విక్రయాల జోరు!

### రెండు నెలల్లో 14 కోట్ల బీర్లు అమ్మకం – ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం

**హైదరాబాద్, (వేకువ సమయం ప్రతినిధి):** తెలంగాణలో మండిపోతున్న ఎండలు బీర్ల అమ్మకాలకు ఊతమిచ్చాయి. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా బీర్ల విక్రయాలు భారీగా పెరిగి రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సుమారు 4 కోట్ల బీర్లు అదనంగా అమ్ముడవగా, మొత్తం విక్రయాలు 14 కోట్లకు చేరినట్లు సమాచారం. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో బీర్ల వినియోగం అత్యధికంగా నమోదైంది. సాధారణ రోజుల్లో 1.5 లక్షల కేసుల వరకు ఉండే అమ్మకాలు, ఎండల తీవ్రత కారణంగా రోజుకు 2.2 లక్షల కేసులకు పెరిగినట్లు తెలుస్తోంది. బీర్ల విక్రయాలు పెరగడంతో ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం కూడా భారీగా సమకూరుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మద్యం ద్వారా వచ్చే వార్షిక ఆదాయం సుమారు రూ.10 వేల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం అది నాలుగు రెట్లు పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. వేసవి సెలవులు, పెళ్లిళ్ల సీజన్, అధిక ఉష్ణోగ్రతలు బీర్ల అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లలో బీర్లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. అయితే అధిక మద్యం సేవనం ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండల సమయంలో మద్యం సేవించడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్, అలసట, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

## గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హోమ్ గార్డ్ గలీజు వేషాలు

గజ్వేల్ : గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హోం గార్డ్ గాజల కరుణాకర్ రెడ్డి వెకిలీ వేషాలు బయటపడ్డాయి. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లో పనిచేస్తూ సమీపంలోని ఓ ఇంట్లో హోమ్ గార్డ్ గాజల కరుణాకర్ రెడ్డి అద్దెకు ఉంటున్నాడు. పక్కింటిలో వుంటున్న గృహిణిని వేధింపులుకు గురి చేస్తున్నాడు. ఒంటిమీద బట్టలు తొలగించి ఆమె ముందు అంగ ప్రదర్శన చేస్తున్నాడు. బట్టలు ఆరేయడానికి మేడపైకి వెళ్ళినప్పుడల్లా తన భార్య ముందు ఇలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని..అతని వేషాలపై భార్య చెప్పడంతో..భర్త రహస్యంగా ఫోటోలు తీశాడు. స్థానిక పోలీసులకు పిర్యాదు చేసాడు. గజ్వేల్ పోలీసు స్టేషన్ లో హోమ్ గార్డ్ కరుణాకర్ రెడ్డిపై కేసు నయోదు అయింది.

## ఎన్నికల హామీలను ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలి




(సమయం ప్రతినిధి అమరచింత) : రోజురోజుకు వ్యవసాయానికి సంబంధించిన ఉత్పాదకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా యూరియా, డి ఏ పి ,కాంప్లెక్స్ ధరలను విపరీతంగా పెంచారు. మరో వైపున మార్కెట్లో యూరియా అందుబాటులో ఉండటం లేదు. కానీ ,ప్రభుత్వం కనీస మద్దతు ధరలను పెరుగుతున్న పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2026 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు వరికి రూ 72/- లు,మొక్కజొన్న 10/- రూ. లు ,పెసర 12/- రూ. లు చెరుకు 100 రూపాయలు ఇలా నామమాత్రంగా ప్రకటిస్తూ నిర్ణయం చేసింది. వ్యవసాయ రంగ సంక్షోభానికి ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వం కారణమన్నారు.. ఇండో – అమెరికా అసమాన ఒప్పందం వలన దేశంలో వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక ,కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్నది. వీటికి వ్యతిరేకంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) , జాతీయ కార్యవర్గం పిలుపుమేరకు జూన్ మొదటివారం(1 నుండి 6) మండల కార్యాలయాల ముందు , జూన్ 8 వ తారీకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కింది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అమర్చిత తాసిల్దార్ కి సమర్పించారు. ఇప్పటికైనా అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకోవాలని తా ము డిమాండ్ చేస్తున్నామన్నారు. పెంచిన DAP, యూరియా, కాంప్లెక్స్ ధరలను తగ్గించాలని వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు (MSP) సమగ్ర ఉత్పత్తి ఖర్చుల ప్రాతిపదికన మీా.స్వామినాథన్ సిఫారసుల మేరకు జ2o 50% ప్రకారం నిర్ణయం చేయాలని అసమానతలతో కూడుకున్న అమెరికా ,భారత్ వాణిజ్య ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని రైతుల వ్యవసాయ రుణాలు అన్నింటిని మాఫీ చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే రాజన్న ఆధ్వర్యంలో జరిగినఈ ధర్నా కార్యక్రమంలో వనపర్తి జిల్లా రైతు కూలి సంఘం అధ్యక్షులు ప్రసాద్, ఏఐయుకేస్ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు వాసారెడ్డి కోశాధికారి టి భీమన్న జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి చంద్రసేనారెడ్డి శ్రీనివాసులు వెంకటేష్, మండల నాయకులు మైల రాములు, మోహన్ ఆంజనేయులు తుల్జారాంలు పాల్గొన్నారు.

## పోరాటంతోనే గద్వాలకు హక్కులు సాధించాం

### కోర్టు స్థలం కోసం కూడా పోరాడాలి: డీకే అరుణ



**(సమయం ప్రతినిధి గద్వాల):** జిల్లా కోర్టు సముదాయానికి అనువైన స్థలం ఎంపిక కోసం న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ మంత్రి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ హామీ ఇచ్చారు. జిల్లా కోర్టు స్థల ఎంపిక అంశంపై చర్చించేందుకు గురువారం గద్వాల బార్ అసోసియేషన్ సభ్యులు ఆమెను కలిసిన సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, గద్వాల ప్రాంతానికి అవసరమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. ఒకప్పుడు గద్వాలకు జిల్లా హోదా సాధ్యం కాదని చెప్పిన వారే చివరకు అంగీకరించే పరిస్థితికి తెచ్చామన్నారు. అదే స్ఫూర్తితో జిల్లా కోర్టుకు అనువైన స్థలం కోసం న్యాయవాదులు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రానికి రెండు లేదా మూడు కిలోమీటర్ల పరిధిలో కోర్టు సముదాయం ఉండటం సమంజసమని, అయితే దాదాపు 10 కిలోమీటర్ల దూరంలో, భద్రతా సౌకర్యాలు లేని ప్రాంతాన్ని ఎంపిక చేయడం బాధాకరమన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అనాలోచిత నిర్ణయాల వల్ల గద్వాల అభివృద్ధి దెబ్బతింటోందని ఆమె విమర్శించారు. పేదల కోసం కేటాయించిన భూమిలో మెడికల్ కాలేజీ నిర్మించడం, రైతుల మార్కెట్ యార్డు స్థలంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం, కేంద్రీయ విద్యాలయానికి కూడా అనువుకాని స్థలాన్ని చూపించడం వంటి చర్యలు ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. జిల్లా కోర్టు కోసం అనువైన స్థలం కేటాయించే విషయంలో ప్రభుత్వ స్థాయిలో తాను కృషి చేస్తానని డీకే అరుణ తెలిపారు. ముఖ్యంగా యువ న్యాయవాదులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పోరాట పంథాను ఎంచుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కావలి నరసింహులు, ఇస్మాయిల్, మదన్ మోహన్ రెడ్డి, శ్రీకాంత్, జయసింహారెడ్డి, రాజేశ్వర్, ఆనంద్ గౌడ్, ఆనంద్ రావు, రమేష్, మన్సూర్, మురలీధర్ రెడ్డిలతో పాటు పలువురు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.









# మంగంపల్లి ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**వనపర్తి, ప్రమాదం ప్రతినిధి:** పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యం లో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి ప్రజల మెప్పు పొందుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పైనే సీఎం తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. కేవలం వనపర్తి నియోజకవర్గం లోని మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం 30 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఐదు లక్షల రూపాయలు ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజా ప్రభుత్వం 10 లక్షల రూపాయలకు పెంచిందన్నారు. పేద ప్రజలు విద్యుత్ భారం ఇబ్బందులు పడకుండా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. అదేవిధంగా రైతులకు రైతు భరోసాతో పాటు రెండు లక్షల రుణమాఫీని చేసి అండగా నిలుస్తుంది అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని



తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. తన సొంత గ్రామమైన మంగంపల్లిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మంగంపల్లి గ్రామంలో ఒక్క పూరిగుడిస కూడా లేకుండా అన్ని పక్క ఇండ్లే ఉండే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలను కూడా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేయడం కోసం తన వంతుగా రూ. 10 లక్షలు కేటాయిస్తానని, జిల్లా కలెక్టర్ ద్వారా మరో రూ.10 లక్షలు తెప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగంపల్లి గ్రామంలోని ప్రతి ఇంటికి సి ఎస్ ఆర్ నిధులతో సోలార్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలో ఏ కార్యం జరిగిన ఐదు మొక్కలు నాటే పద్ధతిని ప్రారంభించాలని తద్వారా మన గ్రామాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు అడుగులు పడాలని సూచించారు. రైతులు కూడా కేవలం వరి మాత్రమే కాకుండా పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని సూచించారు. పామాయిల్ వంటి తోటలను పెట్టేందుకు మొగ్గు చూపాలన్నారు. మహిళలు కూడా ఏదైనా వ్యాపారం చేసేందుకు ముందుకు వస్తే రుణ సదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మంగంపల్లి గ్రామ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులందరూ ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు తీసుకుంటామని తెలియజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మంచి నిర్ణయం తీసుకున్న గ్రామ పాలకవర్గాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచి నీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 50 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు, ప్రజలు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 2027లో కేటీఆర్ పాదయాత్ర

హైదరాబాద్ : ఏ పార్టీ నేత పాద యాత్ర చేసే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడం ఖాయం. ఈ సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పాదయాత్రల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల టీడీపీని గద్దెలోకి దించేందుకు ఆయన పాదయాత్ర చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు జనగ్ కూడా పాదయాత్ర చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో అధికారంలోకి వచ్చారు. ఇక 2023లో టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2022లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇదే సెంటిమెంటు కొనసాగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రను ఎంచుకున్నారు. 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టనున్నట్లు తాజాగా కేటీఆర్ ప్రకటించారు. గతంలో కూడా చెప్పాడు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చనీయాంశమైంది. తాజాగా "ఈలోపు ఫిట్ అవుతాను" అని చెప్పుతూ, పాదయాత్ర మార్గం పార్టీ చర్చల అనంతరం నిర్ణయిస్తామని తెలిపారు. ఇది సాధారణ ప్రకటన కాదు. ఇది బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం లక్ష్యంగా ఈ పాదయాత్రం ఉంటుందని పేర్కొంటున్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్‌కు ప్రజల మధ్య ఒక దూరం ఏర్పడిందని. ఇది చాలా ముఖ్యమైన అంగీకారం. ఎందుకంటే, ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పాలనా యాంత్రికత, అధికార దూరం వల్ల గ్రామీణ?ప్రజా స్థాయి సంబంధాలు బలహీనపడతాయి. బీఆర్ఎస్ ఈ వాస్తవాన్ని అంగీకరించి, పాదయాత్ర ద్వారా ఆ అంతరాన్ని తగ్గించాలని నిర్ణయించుకోవడం రాజకీయంగా బాధ్యతావంతమైన వైఖరి.ఏ పార్టీ నేత పాద యాత్ర చేసే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడం ఖాయం. ఈ సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పాదయాత్రల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల టీడీపీని గద్దెలోకి దించేందుకు ఆయన పాదయాత్ర చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు జనగ్ కూడా పాదయాత్ర చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో అధికారంలోకి వచ్చారు. ఇక 2023లో టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2022లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇదే సెంటిమెంటు కొనసాగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రను ఎంచుకున్నారు.

**2027లో జనంలోకి..** 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టనున్నట్లు తాజాగా కేటీఆర్ ప్రకటించారు. గతంలో కూడా చెప్పాడు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చనీయాంశమైంది. తాజాగా "ఈలోపు ఫిట్ అవుతాను" అని చెప్పుతూ, పాదయాత్ర మార్గం పార్టీ చర్చల అనంతరం నిర్ణయిస్తామని తెలిపారు. ఇది సాధారణ ప్రకటన కాదు. ఇది బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం లక్ష్యంగా ఈ పాదయాత్రం ఉంటుందని పేర్కొంటున్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్‌కు ప్రజల మధ్య ఒక దూరం ఏర్పడిందని. ఇది చాలా ముఖ్యమైన అంగీకారం. ఎందుకంటే, ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పాలనా యాంత్రికత, అధికార దూరం వల్ల గ్రామీణ? ప్రజా స్థాయి సంబంధాలు బలహీనపడతాయి. బీఆర్ఎస్ ఈ వాస్తవాన్ని అంగీకరించి, పాదయాత్ర ద్వారా ఆ అంతరాన్ని తగ్గించాలని నిర్ణయించుకోవడం రాజకీయంగా బాధ్యతావంతమైన వైఖరి.వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు, రాహుల్ గాంధీ వరకు అనేక నాయకులు పాదయాత్రల ద్వారా తమ రాజకీయ జీవితాల్లో కీలక మలుపులు తిప్పుకున్నారు. కేటీఆర్ కూడా ఇప్పుడు అదే మార్గం ఎంచుకోవడం ఆయన ఇమేజ్‌ను 'హై?టెక్, అర్బన్ నాయకుడి' నుంచి 'ప్రజా నాయకుడి'గా మార్చుకోవాలన్న తపనను సూచిస్తోంది. కేటీఆర్ మరో ముఖ్యమైన విషయం స్పష్టం చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తుందని, ఎలాంటి కూటములు లేవని. ఇది ఒకవైపు ధైర్యవంతమైన నిర్ణయం కాగా, మరోవైపు ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో ఆఖకి పెద్ద సవాలు కూడా. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉన్న అసంతృప్తి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తున్నప్పటికీ, పార్టీ సంస్థాగత బలం గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో పాదయాత్ర ద్వారా కేడర్‌ను పునరుజ్జీవింపజేయడం, కొత్త నాయకత్వాన్ని గుర్తించడం, ప్రజల సమస్యలను నేరుగా అర్థం చేసుకోవడం అత్యంత కీలకం.కేటీఆర్ పాదయాత్ర విజయవంతమైతే, అది బీఆర్ఎస్‌ను మళ్లీ తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన ఆప్షన్‌గా నిలబెట్టవచ్చు. ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో ఇప్పటికీ ఉన్న సానుభూతిని మళ్లీ సక్రమంగా ఉపయోగించుకోవడానికి ఇది ఉపయోగపడవచ్చు. అయితే, పాదయాత్ర కేవలం నడక మాత్రమే కాదు. దాని వెనుక స్పష్టమైన అజెండా, ప్రజల సమస్యలపై నిజమైన దృష్టి, స్థిరమైన సందేశం ఉండాలి. లేనప్పుడు ఇది ఒక ఏడాది ముందు ఎన్నికల డ్రామాగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. 2027లో ఆయన పాదయాత్ర ఎంతవరకు ప్రజలను ఆకట్టుకుంటుందనేది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు, రాహుల్ గాంధీ వరకు అనేక నాయకులు పాదయాత్రల ద్వారా తమ రాజకీయ జీవితాల్లో కీలక మలుపులు తిప్పుకున్నారు. కేటీఆర్ కూడా ఇప్పుడు అదే మార్గం ఎంచుకోవడం ఆయన ఇమేజ్‌ను 'హై?టెక్, అర్బన్ నాయకుడి' నుంచి 'ప్రజా నాయకుడి'గా మార్చుకోవాలన్న తపనను సూచిస్తోంది. కేటీఆర్ మరో ముఖ్యమైన విషయం స్పష్టం చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తుందని, ఎలాంటి కూటములు లేవని. ఇది ఒకవైపు ధైర్యవంతమైన నిర్ణయం కాగా, మరోవైపు ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో ఆఖకి పెద్ద సవాలు కూడా.

# విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది : ప్రభుత్వ విప్



**(సమయం ప్రతినిధి మహబూబ్నగర్):** విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బీఈడీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో మహబూబ్‌నగర్‌కు చెందిన నీరటి ఉదయ్ కుమార్ రెడ్డి, మహ్మద్ ఒమర్ ముజాహిద్‌లు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సోషల్ విభాగంలో 150 మార్కులకు 122.58 మార్కులు సాధించి రాష్ట్రంలో 3వ ర్యాంక్ పొందిన నీరటి ఉదయ్ కుమార్ రెడ్డి, గణితంలో 150 మార్కులకు 119 మార్కులు సాధించి 9వ ర్యాంక్ సాధించిన మహ్మద్ ఒమర్ ముజాహిద్‌లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ పేరు రాష్ట్ర స్థాయిలో నిలబెట్టినందుకు విద్యార్థులను ఆయన ప్రశంసించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని, అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా పనులను అడ్డుకున్న రైతులు

రంగారెడ్డి : యాచారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో జరుగుతున్న ఫార్మా పనులను రైతులు అడ్డుకున్నారు. అక్రమంగా ఫార్మా భూముల్లో చదును చేసేందుకు గ్రామానికి పదుల సంఖ్యలో వచ్చిన జేసీబీలు, డోజర్లను అడ్డుకొని కోర్టు స్టే ఉన్న భూముల్లో ఎలాంటి పనులు చేయొద్దని వెనక్కి పంపారు. గ్రామానికి చెందిన చిట్టి నాగమణి అనే మహిళా రైతు ఫార్మాకు భూమిని ఇవ్వలేదు. సర్కార్ నుంచి పరిహారమూ తీసుకోలేదు.. పోలీసుల సహకారంతోఅధికారులు బలవంతంగా భూమిని చదునుచేస్తున్నారని స్థానికుల ఆరోపణ. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి జేసీబీలు, డోజర్లు పొలాలకు రాకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులతో వాగ్వాదం జరిగింది.

# ఫైబ్రాయిడ్స్‌కు సర్జరీ ఒక్కటే పరిష్కారమా?



**నలభై ఏళ్ల వయసులో, చిన్న చిన్న ఫైబ్రాయిడ్స్ కనిపించినా, ఎలాంటి రక్తస్రావం, నొప్పి, అసౌకర్యం లేకపోతే సర్జరీ చేయించుకోవలసిన అవసరం ఉండదు. ఫైబ్రాయిడ్ పరిమాణం, వాటితో తలెత్తే సమస్యలను బట్టి సర్జరీ అవసరమా, లేదా అనేది వైద్యులు నిర్ణయిస్తారు. అయితే ఫైబ్రాయిడ్స్ ఉన్నంత మాత్రాన సర్జరీ చేయించుకోవలసిన అవసరం లేదు. బదులుగా ఇతరత్రా చికిత్సలు కూడా తీసుకోవచ్చు. చిన్న చిన్న ఫైబ్రాయిడ్ల ను కలిగి ఉండీ, గర్భాశయం చిన్నదిగా ఉండీ, అధిక రక్తస్రావం అవుతూ ఉంటే మెడికల్ ట్రీట్మెంట్ ప్రయత్నించవచ్చు. ఈ చికిత్సలో భాగంగా కొన్ని మందులను మూడు నెలల పాటు వాడుకోవచ్చు.**

వీటితో కాలేయం మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది కాబట్టి, ప్రతి నెలా కాలేయ పరీక్షలు చేయించుకుంటూ, ఫలితాన్ని బట్టి మాత్రల వాడకాన్ని కొనసాగించవలసి ఉంటుంది. ఈ మాత్రలతో కొందరికి ఉపశమనం దొరుకుతుంది. కొందరికి ఈ మాత్రలు పని చేయకపోవచ్చు.

సర్జరీలు ఈ సందర్భంలో: నొప్పితో పాటు, రక్తస్రావం అవుతూ ఉంటే, ఫైబ్రాయిడ్ స్థానాన్ని, పరిమాణాన్నీ పరీక్షించవలసి ఉంటుంది. ఒకవేళ ఫైబ్రాయిడ్ గర్భాశయ క్యావిటీలో ఏర్పడితే, సర్జరీ తప్పనిసరి అవుతుంది. సబ్‌మ్యూకస్ ఫైబ్రాయిడ్‌లను హిస్ట్రోస్కోపీ, సబ్‌మ్యూకస్ ఇంట్రామ్యూరల్ అయితే ల్యాప్రోస్కోపీ, ఓపెన్ సర్జరీలను వైద్యులు ఎంచుకుంటారు. కేవలం ఫైబ్రాయిడ్‌నే తీయించుకోవాలనుకుంటే, అలాంటి సర్జరీని ఎంచుకోవచ్చు. పిల్లలు కలిగి ఉన్న వాళ్లు వద్దు అనుకుంటే గర్భాశయాన్ని కూడా తొలగించుకోవచ్చు. కానీ నలభై ఏళ్ల వయసులో గర్భాశయంతో పాటు ఓవరీలను తీయించుకోకూడదు.

మెరీనా పరికరం: 'మెరీనా' అనే ఇంట్రాయుటెరైన్ డివైసతో కూడా ఈ సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. ఈ పరికరం ద్వారా విడుదలయ్యే హార్మోన్ వల్ల గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్ పెరుగుదలకు తోడ్పడే లోపలి పొర పెరగకుండా ఆగిపోతుంది. దాంతో రక్తస్రావం తగ్గిపోతుంది. చిన్న చిన్న ఫైబ్రాయిడ్స్ ఉండీ, రక్తస్రావం ఎక్కువగా ఉన్న వాళ్లు ఈ పరికరాన్ని ఎంచుకోవచ్చు. మెనోపాజ్ దశకు చేరువలో ఉండీ, గర్భాశయం చిన్నదిగానే ఉండీ, ఫైబ్రాయిడ్స్‌తో ఎటువంటి ఇతర అసౌకర్యాలేవీ లేనివాళ్లు మెడికల్ ట్రీట్మెంట్‌ను అనుసరిస్తూ, కొంత కాలం పాటు వేచి చూడవచ్చు. ఈ చికిత్సతో ఫలితం లేనప్పుడు, అంతిమంగా మాత్రమే సర్జరీని ఎంచుకోవాలి. ఫైబ్రాయిడ్స్ చాలా పెద్దవిగా ఉండి, గర్భాశయం 10 సెంటీమీటర్ల కంటే పెద్దదిగా ఉన్నప్పుడు మాత్రలతో పాటు, మెరీనా పరికరం కూడా పని చేయకపోవచ్చు. అలాంటప్పుడు సర్జరీ అవసరం పడుతుంది. సర్జరీ వద్దు అనుకునేవాళ్లు యుటెరిన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్‌ను కూడా ఎంచుకోవచ్చు. అలాగే ఎమ్మారై హైఫు ద్వారా ఫైబ్రాయిడ్లను కరిగించుకోవచ్చు.




**మంచిని బోధించిన ఒకప్పటి కథలు క్రమేపీ కాలగర్భంలో కలిసిపోవడం సహించలేని హైదరాబాద్‌కు చెందిన ప్రియా చౌదరి, వాటిని కొత్త మార్గాల్లో నేటి పిల్లలకు పరిచయం చేయాలని కంకణం కట్టుకుంది. ఆ క్రమంలో 'విను మరీ' పేరుతో, ఆడియో పుస్తకాలు, సాధారణ పుస్తకాలు, యూట్యూబ్‌ల ద్వారా అలనాటి మేటి కథలను వినిపిస్తూ, శ్రోతల మనసులను గెలుచుకోవడం మొదలు పెట్టింది. కొవిడ్ కాలంలో మొదలై నేటికీ నిరాఘాటంగా సాగుతున్న ఆ కథా ప్రయాణం ఆమె మాటల్లోనే....**

అమ్మ చెప్పే కథ ఎంత కమ్మగా ఉన్నా, ఒక్కోసారి పిల్లల ఏకాగ్రత చెదురుతూ ఉంటుంది. అది గ్రహించిన అమ్మ, 'కథ చెప్పమని అడిగావు కదా, 'విను మరీ' అంటూ పిల్లల్లో తిరిగి ఆసక్తిని నింపుతుంది. ఈ మాట ప్రతి ఇంట్లో వినిపించేదే కాబట్టి నా కథా ప్రయాణానికి ఆ మాటనే ఎంచుకున్నాను. చిన్నప్పుడు నాన్నగారు, విజయవాడ, చెన్నై నుంచి కథల పుస్తకాలు తెప్పించేవాళ్లు. అమ్మా నాన్న ఇద్దరూ కథలు చెప్పేవాళ్లు. అలా పుస్తకాలు చదువుతూ, కథలను వింటూ ఎన్నో విలువలను నేర్చుకున్నాను. కథ మంచి అలవాట్లను నేర్పించాలి. నీతిని బోధించాలి. అన్నిటికంటే ముఖ్యంగా జీవన నైపుణ్యాలను మెరుగుపరచాలి. అలాంటి కథలు క్రమేపీ మరుగున పడిపోతున్నాయి. ఆ కథలను తిరిగి పిల్లలకు, పెద్దలకూ పరిచయం చేయాలనే ఆలోచనతో 2020 కొవిడ్ కాలంలో ఈ ప్రయత్నానికి పూనుకున్నాను.

## ప్రముఖుల తోడ్పాటుతో...

చిన్నప్పటి నుంచీ వ్యాసాలు రాయడం అలవాటు. హిందూ దినపత్రికలో, పిల్లల కథల పుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. ఈ ఆసక్తి వయసుతో పాటు పెరిగింది. దీనికి అమ్మ ప్రోత్సాహం కూడా తోడైంది. అలా ప్రారంభంలో ఆడియో స్టోరీ బుక్స్‌తో శ్రీకారం చుట్టాను. కథ వినే వారికి పదజాలం, పద ఉచ్ఛారణ మెరుగుపడాలి. అలాగే భావం తెలియాలి. కాబట్టి గాయకులు శ్రీకృష్ణ, గోపిక పూర్ణిమ, తనికెళ్ల భరణి కథలకు స్వరాలనిచ్చారు. కార్తీక్ సంగీత దర్శకత్వం వహించారు. తమిళంలో సైంధవి ఇవే కథలను వినిపించారు. ఈ ప్రయత్నానికి నటులు రాణా తోడ్పాటు కూడా ఎంతో ఉంది. ఇలా ప్రముఖుల ప్రమేయంతో ఆడియో బుక్స్ అన్నిటినీ శ్రోతలకు వీలైనంత చేరువ చేయగలిగే ప్రయత్నానికి పూనుకున్నాను. శ్రీకృష్ణ గారు.. వేమన పద్యాలు, పిట్ట కథలు, జై వీరాంజనేయ ఆడియోలకు తన గొంతును అందిస్తే, ఆయన, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ శిల్ప కలిసి సాయి పారాయణం ఆడియో బుక్‌కు సహాయపడ్డారు. అలా ఆడియోబుక్స్, శ్రీరామ, శ్రీకృష్ణుడు పేపర్‌బ్యాక్ బుక్స్ ప్రచురించాం. ఆ తర్వాత వేమన పద్యాలతో పాటు పర్ల్స్ ఆఫ్ విజ్‌డమ్, ప్యారీ ఛోటీ కహానీ మొదలైన పుస్తకాలను తెలుగు, హిందీ, తమిళం, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించి, దేశ వ్యాప్తంగా కొన్ని సంస్థలకు, పాఠశాలలకూ, పిల్లలకు చేరుతుందనుకున్న ప్రతి ప్రదేశంలో డొనేట్ చేశాం. అన్ని కుటుంబాలకూ కథల పుస్తకాలు కొనేంత స్థోమత లేకపోవచ్చు కాబట్టి కిరణ్ బేడీ ఇండియా విజన్, తమిళనాడులో అగరం ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు ఆ పుస్తకాలను అందచేశాం. పర్ల్స్ ఆఫ్ విజ్‌డమ్ పుస్తకావిష్కరణ చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా జరిగింది.

## ఊహలకు రెక్కలు తొడగడం కోసమే...

తాజాగా చాణక్య నీతి ప్రాజెక్టు పనిలో ఉన్నాను. దీన్లో తనికెళ్ల భరణి గారు సంస్కృతంలో శ్లోకం చెప్తే, 11 ఏళ్ల పాప ఇంగ్లీషలో ఆ శ్లోకానికి అర్థం చెప్పి, అనుబంధంగా కథ చెప్తుంది. ఇప్పటి పిల్లలకు చాణుక్యుడి గురించి తెలియదు. ఆయన స్థాపించిన తక్షశిల విశ్వవిద్యాలయంలో బోధించిన బోధనలు మనుషులు భూమి మీదున్నంతకాలం ఉపయోగపడతాయి. వీళ్లిద్దరితో కలిపి పంచతంత్ర కథలను కూడా రూపొందిస్తున్నాం. అయితే కథలన్నిటినీ పుస్తకాలకూ ఆడియో బుక్స్‌కే పరిమితం చేయడానికి కూడా ఓ కారణం ఉంది. కథ విన్నప్పుడు ఆ కథలోని పాత్రలను ఎవరికి నచ్చినట్టు వాళ్లు ఊహించుకునే వెసులుబాటు చిక్కుతుంది. కానీ వీడియోలో మనం చూపించే పాత్రలే మనసుల్లో ముద్రించుకుపోతాయి. నాకది ఇష్టం లేదు. ప్రతి ఒక్కరి ఊహాశక్తి భిన్నంగా ఉంటుంది. కాబట్టి ఊహలకు రెక్కలు తొడగడం కోసమే ఇలా ఆడియో బుక్స్‌కే పరిమితమయ్యాను. ఈ కథలతో ప్రధానంగా పిల్లలకెన్నో ప్రయోజనాలు దక్కుతాయి. జీవన నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఉదాహరణకు పంచతంత్ర పుస్తకాన్నే తీసుకుంటే, దాన్లో లెక్కలేనన్ని జీవననైపుణ్యాలు మనకు కనిపిస్తాయి. వేమన పద్యాలన్నీ ఆర్థిక సలహాలు, జీవన నైపుణ్యాల సమాహారాలే! ప్రస్తుతం, యాపిల్, ఆడిబుల్, స్టోరీటెల్, యూట్యూబ్‌ల, స్పాటిఫై ద్వారా ఆడియో బుక్స్‌ను అందిస్తున్నాను. మన దేశంతో పాటు విదేశాల్లోని అనేక మంది శ్రోతలు ఈ ఆడియోబుక్స్‌కు అభిమానులుగా మారుతూ ఉండడం సంతోషంగా ఉంది.

## పిల్లలకు ఇంగ్లీషు నవలలా?

ఓసారి పార్కులో కూర్చున్నప్పుడు నాకు కొద్ది దూరంలో ఉన్న ఒక మహిళ, తొమ్మిదో తరగతి చదువుతున్న తన కూతురికున్న పుస్తక పఠనాసక్తి గురించి మరొక మహిళకు గొప్పగా వివరిస్తోంది. వాళ్ల సంభాషణను చెవులు రిక్కించి వినకపోయినా, ఆ మాటలు నా చెవిలో పడుతున్నాయి. అనుకోకుండా ఆమె నా దగ్గరకొచ్చి పలుకరించి, మాటలు కలిపింది. నేనప్పుడు 'మీ పాప పంచతంత్ర చదివిందా?' అని అడిగాను. 'మా అమ్మాయి అవన్నీ చదవదు. కేవలం ఇంగ్లీష్ నవలలే చదువుతుంది' అని చెప్పింది. ఆ అమ్మాయి, ఇంగ్లీష్ నవలా రచయిత సిడ్నీ షెల్డన్ పుస్తకాలు చదువుతోందని తర్వాత, ఆమె మాటల ద్వారా తెలిసింది. అసలా పుస్తకంలో ఏముంటుందో కూడా తల్లికి తెలియకపోవడం, చక్కని తెలుగు కథా పుస్తకాలను వదిలేసి, ఇంగ్లీషు నవలలు చదివే కూతురి గురించి ఆ తల్లి గొప్పగా చెప్పుకోవడం నాకెంతో బాధేసింది. పైగా 'ఈ పుస్తకంలో ఉన్నదానికీ, నిజజీవితంలో జరుగుతున్నదానికీ సంబంధం లేదేంటి?' అని కూతురు అడిగే ప్రశ్నకు తల్లి సమాధానం చెప్పలేకపోతున్నట్టు కూడా ఆమె మాటల ద్వారా గ్రహించాను. పిల్లలు ఇంగ్లీషు పుస్తకాలు చదవడం తప్పు కాదు. కానీ వాళ్ల వయసుకు తగ్గట్టు లియో టాల్‌స్టాయ్, యూసప్స్ ఫేబుల్స్, ఎనిడ్ బ్లైటన్ కథల పుస్తకాలు కూడా ఉన్నాయి. వాటికి బదులుగా పెద్దలకు ఉద్దేశించిన నవలలు చదవడం ఎంతవరకూ సమంజసం? గతంతో పోలిస్తే, నేడు పిల్లలకు సేఫ్ టచ్ గురించి బోధించేటంత దారుణమైన స్థితికి చేరుకున్నాం. కథలు వినడం, చదవడం వల్ల ఈ అంశం పట్ల అవగాహన పెరుగుతుంది. చదువు ప్రాముఖ్యం తెలిసొస్తుంది. తల్లితండ్రువులు, గురువుల పట్ల గౌరవం పెరుగుతుంది. స్నేహ ధర్మం విలువ తెలుస్తుంది.

## అంధుల కోసం బ్రెయిలీలో...

చిన్న జియర్‌స్వామి గారి ఆశ్రమానికి చెందిన నేత్ర విద్యాలయలో పాక్షిక అంధ బాలబాలికలున్నారు. వాళ్ల కోసం బ్రెయిలీలో పుస్తకం ప్రచురించాను. వేద పాఠశాలలో పిల్లలకు ఆడియో బుక్స్ అందించాను. మున్ముందు అంధ పిల్లలకూ, కథల పుస్తకాలు కొని చదివే వీల్లేని పిల్లలందరికీ ఆడియో బుక్స్ అందించాలని ఉంది. మరణానికి చేరువైన వ్యక్తులకు ఆశ్రయమిచ్చే హాస్పైస్ కేర్‌లో గ్రంథాలయానికి కూడా పుస్తకాలు అందించాను. అలాగే స్టోరీ టెల్లింగ్ సెషన్ కూడా చేశాను.



**రంజాన్ ఉపవాస దీక్ష పాటించడానికి ముందు సహరీ, ఇఫ్తార్‌ల గురించి పరిజ్ఞానం ఉండడం చాలా అవసరం. నిర్ణీత సమయానికి ముందు కానీ, సమయం దాటిన తరువాత కానీ సహరీ, ఇఫ్తార్ చేస్తే ఉపవాసం వ్యర్థమయ్యే ప్రమాదం ఉంది. నమాజ్‌లో కానీ, రోజా (ఉపవాసం)లో కానీ, హజ్ సమయంలో కానీ సమయపాలనకు, క్రమశిక్షణకు ఇస్లాం చాలా ప్రాధాన్యం ఇస్తుంది. ఏది చేసినా పరిజ్ఞానంతో చేయాలి. దానికోసం అంతిమ మహాప్రవక్త మహమ్మద్ తన ఆచరణ ద్వారా నిర్ధారించిన నియమాలను మాత్రమే అనుసరించాలి. "రాత్రి నల్లదనం నుంచి ఉషోదయపు తెల్లదనం ప్రస్ఫుటం అయ్యేవరకూ ఆహారం, పానీయాలు తీసుకోండి. తరువాత రాత్రి చీకటి పడేవరకూ ఉపవాసం ఉండండి అని దీని గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఆదేశించారు.**

# సంకల్ప శుద్ధితో ఉపవాసం

**సహరీ, ఇఫ్తార్ అంటే...** రాత్రి చివరి, మూడో జాములో చేసే భోజనాన్ని 'సహరణ అంటారు. "సహరీ పాటించండి. అందులో మీకు చాలా శుభం ఉంది అని దైవ ప్రవక్త తెలిపారు. "మీలో మంచి వైపు పిలిచేవారు, చెడు వైపు వెళ్ళకుండా వారించేవారు తప్పకుండా ఉండాలి. అటువంటి వారికి శిక్షణ సహరీ నుంచే లభిస్తుంది. సహనం, సమయపాలన, త్యాగం, ఓర్పు, క్షమ, లైంగిక వాంఛలను అదుపులో ఉంచడం, మనో నిగ్రహం, జవాబుదారీతనం... వీటన్నిటికి దారి ఏర్పడుతుంది. దీనికి సంకల్పశుద్ధి తప్పనిసరి. ఇతరుల మెప్పుకోసం కాఉండా, అల్లాహ్ ప్రసన్నతను, అనుగ్రహాన్ని పొందడానికే చెయ్యాలి. కాబట్టి మనసులో గట్టిగా సంకల్పించుకోవాలి. అని ఉపదేశించారు. ఇక, మగ్రిబ్ నమాజ్‌కు ముందు ఉపవాసాన్ని విరమిస్తూ తీసుకొనే ఆహారాన్ని 'ఇఫ్తార్ అంటారు. సూర్యుడు అస్తమించిన వెంటనే ఇఫ్తార్ చేయాలి. జాప్యం చేయకూడదు. ఎందుకంటే ఉపవాస లక్ష్యం ఆకలితో ఉంచడం కాదు... విధేయతా భావం జనించడానికి మాత్రమే.

**సుగుణాలు పెరగడానికి...** రంజాన్ మాసం స్నేహ సంబంధాలను పెంపొందించే నెల. తోటివారికి సేవలందించే నెల. తమ ప్రేమను, ఆనందాన్ని తినుబండారాల రూపంలో, రుచికరమైన ఫలాల రూపంలో ఇఫ్తార్ సమయంలో పంచుతారు. ఇది చాలా పుణ్యప్రదమైన కార్యం. "ఉపవాసం పాటించిన వ్యక్తితో ఇఫ్తార్ చేయించినవారి అపరాధాలను అల్లాహ్ మన్నించడం జరుగుతుంది. అతను చేసే ఈ సత్కార్యం అతణ్ణి నరకాగ్ని నుంచి విమోచనం కలిగించే సాధనం. ఇఫ్తార్‌లో ఖర్జూర పండ్లు వినియోగించడం ప్రవక్త సంప్రదాయం. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం చేసిన వ్యక్తి చేసిన విజ్ఞాపనను దైవం స్వీకరిస్తాడు. తిరస్కరించడు" అని 'హదీస్' గ్రంథం స్పష్టం చేస్తోంది. ఉపవాసాల ద్వారా మనిషి ఆకలి అంటే ఏమిటో అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. తద్వారా సమాజంలోని నిరుపేదలను, అన్నార్తులను ఆదుకొనే గుణం అలవడుతుంది. ఉపవాస వ్రతం వల్ల మనిషిలో దైవభీతి, పాపతి, జవాబుదారీతనం లాంటి సుగుణాలు జనిస్తాయి.

---




**ఆలయాలలో మనకు శివుడు సాధారణంగా లింగ రూపంలో కనిపిస్తాడు. కానీ శివరూపాలు అనంతం. శివలీలలు అపారం. ఆగమశాస్త్రాలు పలు రూపాలను వివరించాయి. ఆ రూపాల ఆధారంగా శివలీలల గురించి మనం తెలుసుకోవచ్చు. ప్రతి శివరూపం వెనుక ఒక పురాణ గాథ ఉంది. ప్రతి గాథలోనూ శివతత్త్వ మహత్తు నిండి ఉంది. ఆ రూపాలు పరవశింప చేస్తాయి. ఆ గాథలు తన్మయత్వం కలిగిస్తాయి. అభీష్ట వరదాయకాలైన ఈ శివరూపాల్ని ధ్యానించినా, ఈ గాథల్ని స్మరించినా శివానుగ్రహం తప్పక కలుగుతుందనేది పెద్దల మాట. ఆ రూపాలలో కొన్ని...**

మొదటి పేజీ తరువాయి

### శ్రీ లింగమూర్తి:

శివరూపం అనగానే గుర్తుకువచ్చేది శివలింగం. 'లిం' అంటే సృష్టి, 'గం' అంటే లయం. ఈ చరాచర సృష్టి ఎక్కడినుంచి మొదలవుతుందో, తిరిగి దేనిలో కలిసిపోతుందో అదే శివలింగం. శివలింగం పరమేశ్వరుడైతే, పీఠం పార్వతీదేవి రూపం. కాబట్టి అది శివశక్తుల సమష్టి రూపం. అంతేకాదు, ఇందులో త్రిమూర్తులు కూడా కలిసి ఉన్నారు. భూమిలో ఉండే నలుచదరపు భాగం బ్రహ్మగా, పీఠంలోని ఎనిమిది పలకలు విష్ణువుగా, పైన మనకు దర్శనమిచ్చే గుండ్రటి భాగం శివరూపంగా గ్రహించినవారికి శివలింగం ఆంతర్యం అర్థమవుతుంది.

### శ్రీలింగోద్భవమూర్తి:

పూర్వం ఒకసారి బ్రహ్మ, విష్ణువు తామే గొప్పవారమని ఒకరితో ఒకరు కలహించుకున్నారు. వారి గర్వం పోగొట్టడానికి శివుడు ఆది, అంతం లేని అగ్నిస్తంభంలా దర్శనమిచ్చాడు. ఆ శివలింగం మొదలు కనుక్కోడానికి శివుడు వరాహంగా, తుదిభాగాన్ని దర్శించడానికి బ్రహ్మ హంసగా ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పుడు శివుడు ఆ లింగం నుంచి (లింగోద్భవమూర్తిగా) ఉద్భవించాడు. బ్రహ్మను వేదాధిపతిగా, విష్ణువును తనతో సమానమైన దైవంగా అనుగ్రహించాడనేది ఐతిహ్యం.

### శ్రీకల్యాణ సుందరమూర్తి:

పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు ప్రజల్ని కష్టాలు పెడుతూ పీడించసాగాడు. పార్వతీ పరమేశ్వరుల పుత్రుడి వల్లనే తనకు మరణం కలగాలని బ్రహ్మ నుంచి వరం కూడా పొందాడు. రోజురోజుకూ పెరిగిపోతున్న అతని ఆగడాలను అరికట్టాలని అందరూ శివుణ్ణి వేడుకున్నారు. లోకకల్యాణం కోసం హిమవంతుడి కుమార్తె పార్వతీదేవిని శివుడు పరిణయం చేసుకున్నాడు. అంగరంగ వైభవంగా జరిగిన ఆ వివాహంలో స్వామి 'కల్యాణసుందరమూర్తి'గా దర్శనం ఇచ్చాడు.

### శ్రీచంద్రశేఖరమూర్తి:

లోకానికి వెలుగును ఇచ్చే చంద్రుడు ఒకప్పుడు చీకటిలో మగ్గిపోయాడు. తన మామ దక్షప్రజాపతి ఇచ్చిన శాపం వల్ల రోజురోజుకూ క్షీణించిపోయాడు. భయంకరమైన కుష్టువ్యాధితో బాధపడుతూ.... శివుడి గురించి ఘోర తపస్సు చేశాడు. శివానుగ్రహంతో నెలలో పదిహేను రోజులు పెరిగేటట్టు, పదిహేను రోజులు తరిగేటట్టు వరం పొందాడు. ఎప్పటికీ తరుగుదల లేని రేఖగా శివుని శిరస్సుపై ఉండే భాగ్యాన్ని కూడా పొందాడు. అప్పటినుంచి శివుడు 'చంద్రశేఖరమూర్తి'గా పిలుపునందుకుంటున్నాడు.

### శ్రీ గంగాధరమూర్తి:

పూర్వం సగర చక్రవర్తి కుమారులు తమ యాగాశ్వం కోసం వెతుకుతూ... ముని శాపానికి గురై బూడిద కుప్పలుగా మారిపోయారు. వారికి ఉత్తమ గతులు కలగాలంటే దేవలోకంలో ఉన్న గంగ కిందికి దిగిరావాలి. అందుకోసం సగర చక్రవర్తి వంశస్థుడైన భగీరథుడు తీవ్ర తపస్సు చేశాడు. గంగ భూమిపైకి దూకితే దాన్ని నియంత్రించే శక్తి ఒక్క శివుడికే ఉందని తెలుసుకొని... ఆయనను ప్రార్థించాడు. అందుకు అంగీకరించిన శివుడు గంగను తలపై ధరించాడు. భగీరథ ప్రయత్నం ఫలించింది. శివునికి 'గంగాధరమూర్తి' అనే నామం ప్రాప్తించింది.

### శ్రీ సోమాస్కందమూర్తి:

తారకాసుర సంహారం కోసం పరమేశ్వరుడు తన రేతస్సును అగ్నిదేవుడికి ఇచ్చి కాపాడమన్నాడు. అతడు దాన్ని తట్టుకోలేక ఒక రెల్లుగడ్డి వనంలో వదిలిపెట్టాడు. ఆ శరవనంలోనే స్కందుడు జన్మించాడు. ఆరుగురు కృత్తికలు ఆయ నను పెంచారు. అనంతరం నందీశ్వరుడు వచ్చి, స్కందుణ్ణి కైలాసానికి తీసుకొని వెళ్ళాడు. తన కుమారుణ్ణి దేవతల సేనానాయకుడిగా పరమశివుడు నియమించాడు. ఆ సందర్భంగా శివపార్వతులు... కుమారస్వామిని తమ మధ్యలో ఉంచుకొని అందరికీ దర్శనం ఇచ్చిన రూపమే 'సోమాస్కందమూర్తి' రూపం.

### శ్రీహరిహరమూర్తి:

హరిహరుల మధ్య భేదం లేదని తెలిపేందుకు శివుడు ఈ రూపాన్ని ధరించాడు. పూర్వం దేవతలు లోకం అశాంతిగా ఉందంటూ విష్ణువు వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. శాంతిని ఇచ్చేవాడు శంకరుడేనని విష్ణువు వారికి తెలిపాడు. అందరూ కలిసి కైలాసానికి వెళ్ళారు. అక్కడ వారికి శివదర్శనం కాలేదు. అప్పుడు దేవతలందరూ ఒక వ్రతం ఆచరించారు. చివరిగా విష్ణు హృదయంలోని అక్షయ లింగాన్ని కూడా ఆరాధించగా, వారికి పరమేశ్వరుడు... కుడివైపు శివుడు, ఎడమవైపు విష్ణువు కలిసి ఉన్న రూపంలో... శ్రీహరిహరమూర్తిగా దర్శనమిచ్చాడు.

# రాష్ట్రంలోనే వనపర్తిని మోడల్‌గా తీర్చిదిద్దుతా





వనపర్తి. సమయం ప్రతినిధి: రాష్ట్రంలోనే వనపర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. ప్రజాపాలన 99 ప్రగతి ప్రణాళిక వార్డు సభ కార్యక్రమాన్ని గురువారం కర్రెమ్మ గుడి వద్ద అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎమ్మెల్యే నామినేషన్ దాఖలు చేయకముందే తాను ప్రజలకు సెల్ఫ్ డిక్లరేషన్ ప్రకటించానని గుర్తు చేశారు. రాజకీయాల్లోకి ఆస్తులు కూడగట్టుకోవడానికి రాలేదని, ప్రజలకు సేవకుడిగా పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. అధికారం ఉందనే అహంకారంతో పేదల భూములు, ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు, ట్రస్ట్ భూములు, గుట్టలను ఆక్రమించుకోవడం అప్రజాస్వామిక చర్య అని ఎమ్మెల్యే తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సహకారంతో వనపర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెడతామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికై అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. డిసెంబర్ 7 2023న ప్రభుత్వం ఏర్పాటు అయినా వెంటనే మొదటగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం చేసేందుకు మొదటి సంతకం చేసిందన్నారు. ఆర్టీసీలో మహిళలు ఉచిత ప్రయాణానికి ఒక్క వనపర్తి జిల్లాలోనే ఇప్పటివరకు 30.29 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం ధర చెల్లించడం జరిగింది అన్నారు. ఆరోగ్య భీమాను 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచడం జరిగిందని అదేవిధంగా జిల్లాలో 30 వేల తెల్ల రేషన్ కార్డులు కొత్తగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు పై ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వము విద్యా వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇచ్చిందని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, అల్పాహారం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు 6000 మంది కొత్త టీచర్లకు నియామకం చేసినట్లు తెలిపారు. జిల్లాలో 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో రూ. 207 కోట్ల వ్యయంతో 500 పడకల ఆసుపత్రి మంజూరీ చేసినట్లు చెప్పారు. ఐ.టి. టవర్, పాలిటెక్నిక్ కళాశాల భవనానికి పూర్వ వైభవం తీసుకురావడానికి 10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో 70 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి రోడ్లు వేయడం జరిగిందని, మరో 30 కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అందుకే ఏ సంక్షేమ పథకం అయినా మహిళలే ప్రాతినిధ్యం వహించే విధంగా రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. త్వరలో వనపర్తి మహిళలకు డీజిల్ బంక్ మంజూరు కాబోతుందని, 546 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే మంజూరు అయ్యాయని, ప్లాట్లు లేని నిరుపేదలకు 1000 ప్లాట్లు మంజూరు చేసి అందులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే విధంగా ప్రభుత్వానికి తాను ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె లేకుండా అన్ని పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పుర కౌన్సిలర్లు శరవంద, వెంకటేశ్వర్లు, పాకనాటి కృష్ణ, మురళి సాగర్, నిర్మలమ్మ, అయేషా సిద్ధిఖ, సౌమ్య, ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, మెప్మా, సానిటేషన్ ఇన్స్పెక్టర్, పలువురు పాల్గొన్నారు.

## తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలను వెంటనే వదిలేయాలి



(సమయం ప్రతినిధి వనపర్తి) : సీఎం పర్యటన పేరుతో అక్రమంగా నిర్బంధి స్తారా ఈ సింగారానికి ముఖ్యమంత్రి పర్యటన అవసరమా ? అంటూ విపత్తుల సమయంలో పర్యటన చేయనివారు ఇప్పుడెందుకు పర్యటన చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ కల్లాల్లో వడ్లు అలాగే ఉన్నాయని రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్ పర్యటన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని వారు ఏదో చేస్తారు అన్న భ్రమలో తెలంగాణ ప్రజలు లేరని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు పర్యటన నేపథ్యంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

## భవ్యశ్రీను అభినందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి



(సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల జిల్లా): మల్దకల్ మండలంలోని నీలిపల్లి గ్రామానికి చెందిన శివ కేశవరెడ్డి కుమార్తె భవ్యశ్రీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంలో బండ్ల రాజశేఖర్ రెడ్డి నివాసంలో భవ్యశ్రీ కి స్వీట్ తినిపించి అభినందించారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రమ్య ఇండస్ట్రీస్ అధినేత శ్రీ బండ్ల రాజశేఖర్ రెడ్డి దంపతులు. ఈ సందర్భంగా బండ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో ఉద్యోగం సాధించడం గర్వించదగ్గ విషయమని, రానున్న రోజుల్లో మంచి స్థానంలో ఉండాలని గ్రామానికి జిల్లాకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా బండ్ల రాజశేఖర్ రెడ్డి కొనియాడారు.

## ఖజానా ఖాళీ... ప్రతి నెలా దాదాపు రూ.18 వేల నుంచి 20 వేల కోట్ల ఖర్చు..

హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కార్.. తెలంగాణ బండిని నడపలేక దిక్కులు చూస్తోందా? ఏం చేయాలో తోచక ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారా? తెలంగాణ సర్కార్‌కు ఆర్థిక కష్టాలు కొత్త తలనొప్పులు తెస్తున్నాయా? నిధుల లేమితో అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఏకంగా ఆర్థిక శాఖ మంత్రే ఎమ్మెల్యేలతో ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆర్థిక పరిపుష్టికి ఇంకా సమయం పడుతుందని..అప్పటిదాకా కొత్తగా నిధులు ఇవ్వలేమంటూ ఏకంగా ఆర్థిక మంత్రే చేతులెత్తేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఇలా అయితే ఇక ప్రజల్లోకి వెళ్లేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు.తెలంగాణ సర్కార్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. అవును. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఇచ్చిన రిపోర్ట్ ఇదే స్పష్టం చేస్తోంది. లోటు బడ్జెట్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు కాగ్ స్పష్టం చేసింది. హామీల అమలుకు ఆర్థిక స్థితి అడ్డంకిగా మారుతోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇస్తే..వాటిని అమలు చేయడం ఇప్పుడు సర్కార్‌కు సవాల్‌గా మారింది. బడ్జెట్ అంచనాలకు..వాస్తవాలకు పొంతన లేని పరిస్థితి. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వానికి 100 రూపాయలు ఆదాయం వస్తే దాదాపు 108 రూపాయలు ఖర్చు అవుతుంది. దీని కోసం ప్రతినెల అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో కేవలం రెండున్నర ఏళ్లలోనే 4.14 లక్షల కోట్ల అప్పులను తెచ్చింది సర్కార్. గతంలో ఉన్న అప్పులకు..అసలు, వడ్డీలు కట్టలేక నడ్డి విరుగుతుంటే..మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్లుగా కొత్తగా అవుతున్న లక్షల కోట్ల అప్పులు రేవంత్ ప్రభుత్వానికి గుదిబండగా మారాయి.అటు సంక్షేమాన్ని.. ఇటు అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరాటపడుతుంటే..రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారుతోంది. దీంతో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు?కొత్త కొత్త పనులు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ సర్కార్ ముందుకెళ్తోంది. వాస్తవంగా ప్రతి నెల జీతాలు, పెన్షన్లు, అసలు, వడ్డీల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఇతర చెల్లింపులు అన్నీ దాదాపు 18 వేల నుంచి 20 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ వాస్తవ రాబడి మాత్రం కేవలం 16 నుంచి 18 వేల కోట్లలోపే ఉంటుంది. అంటే దాదాపు ప్రతి నెల సగటున రూ.2,250 కోట్ల లోటు సర్కార్ కు సవాల్ గా మారుతోంది. ప్రభుత్వం శక్తికి మించి కార్యక్రమాల అమలుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టడం.

## తెలంగాణ ఎవరు జాగీర్

హైదరాబాద్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరం పూర్తయింది. అయినా ఇప్పటికీ తెలంగాణ అంశం, ఉద్యమం, సెంటిమెంట్ ప్రజల్లో రగులుతూనే ఉంది. రాజకీయ నేతలు దానిని రగిలిస్తూనే ఉన్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధంతో తెలంగాణ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాష్ట్రం 12 ఏళ్లు గడిచినా, ఆ అస్తిత్వం ఇప్పటికీ రాజకీయ యుద్ధభూమిగా మారుతోంది. ఇటీవలి పవన్ కల్యాణ్?పొన్నం ప్రభాకర్ వాగ్వాదం ఈ వాస్తవాన్ని మరోసారి బయటపెట్టింది. తెలంగాణ ఏర్పాటు దినోత్సవం సమయంలో హైదరాబాద్‌లో 'నవనిర్మాణ సభ' నిర్వహించాలని పవన్ కల్యాణ్ ప్రకటించగా, మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అని పవన్ ప్రశ్నించిన దానికి "అవును, మా అయ్య జాగీరే" అన్న తీరుగా వచ్చిన సమాధానాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.ఉద్యమం నుంచి జాగీరు మనస్తత్వం వరకుదశాబ్దాల పోరాటం, విద్యార్థుల త్యాగాలు, యువకుల ఆత్మాహుతులు, లక్షలాది మంది ప్రజల ఉద్యమ ఉత్సాహం.. ఇవన్నీ తెలంగాణను కేవలం ఒక భౌగోళిక ప్రాంతంగా కాకుండా ఆత్మగౌరవ చిహ్నంగా నిలిపాయి. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు "మా రాష్ట్రం, మా సంపద, మా నిర్ణయాలు" అన్న నినాదం ప్రజల హృదయాల్లో గాఢంగా నాటుకుంది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొంతమంది నాయకులు ఆ స్ఫూర్తిని తమ కుటుంబం, తమ పార్టీ లేదా తమ ప్రాంతీయ ఆధిపత్యానికి పరిమితం చేస్తున్నారు. "ఇది మా అయ్య జాగీరు" అన్న మాటలు ఆ ఫ్యూడల్ భావనను స్పష్టంగా బయటపెడుతున్నాయి. ఉద్యమ కాలంలో అణచివేతను ఎదిరించిన వారే ఇప్పుడు తమను తాము "యజమానులు"గా చూసుకోవడం బాధాకరం.తెలంగాణపై మూడు ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల సొత్తా? పార్టీలదా..?, బయటివారిదా? అంటే ఇది ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు, ఎవరి కుటుంబ వ్యాపారం కాదు.ఏదైనా ఒక రాజకీయ పార్టీ లేదా కుటుంబం యాజమాన్యంలో ఉందా?ఎవరి ఆధిపత్యంలోనూ ఉండకూడదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, రాష్ట్రం ప్రజల సార్వభౌమత్వానికి లోబడి ఉండాలి.

**రాజకీయం చేయడం తప్పా :** భారత రాజ్యాంగం ప్రకారం ఏ భారతీయ పౌరుడికైనా దేశంలో ఎక్కడైనా రాజకీయ కార్యకలాపాలు చేసే స్వేచ్ఛ ఉంది. కానీ ఆ కార్యకలాపాలు స్థానిక భావాలను గౌరవించి, ఉద్యమ త్యాగాలను అవమానించకుండా జరగాలి. "వలసదారులు" అన్న మాటను రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కూడా ప్రమాదకరం. పవన్ కల్యాణ్ గతంలో తెలంగాణ ఏర్పాటుపై చేసిన కొన్ని వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల భావాలను గాయపరిచాయన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో, స్థానిక నాయకులు "ఇది మా జాగీరు" అని చెప్పడం ఆ గాయాలను మరింత లోతు చేస్తోంది. రెండు వైపులా ఉన్న ఈ ధోరణి తెలుగు రాష్ట్రాల మధ్య సహజీవనానికి మంచిది కాదు.తెలంగాణ ఉద్యమం అణచివేతకు వ్యతిరేకంగా పుట్టింది. ఆ ఉద్యమ స్ఫూర్తి ఇప్పుడు కొందరి రాజకీయ ఆధిపత్యం మరియు వ్యక్తిగత స్వార్థాలకు బలి అవుతోంది. "జాగీరు" మనస్తత్వం రాజకీయాలను కుటుంబ ఆస్తిగా మార్చేస్తుంది. ఇది దీర్ఘకాలికంగా ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తుంది. నిజమైన అభివృద్ధి కావాలంటే తెలంగాణను ఎవరి యాజమాన్యంగా కాకుండా, అందరి హక్కుగా చూడాలి. నాయకులు యజమానులుగా కాకుండా సేవకులుగా పని చేయాలి. బయటి నాయకులైనా, స్థానికులైనా వారి పనితనం, వారి విధానాలు, వారి నిబద్ధత ఆధారంగానే ప్రజలు నిర్ణయం తీసుకోవాలి.తెలంగాణ ప్రజలు దశాబ్దాల త్యాగాలతో సాధించిన ఆత్మగౌరవం ఇప్పుడు రాజకీయ లాభాల కోసం బలిపశువు కాకూడదు. ఈ "జాగీరు" వివాదం ఒక సంకేతం మాత్రమే. ఇది రాజకీయ వ్యవస్థలో ఇంకా ఉన్న ఫ్యూడల్ మనస్తత్వానికి అద్దం పడుతోంది తెలంగాణ ముమ్మాటికీ ఇక్కడి ప్రజలదే. మిగతా అన్నీ కేవలం రాజకీయ భ్రమలు మాత్రమే.







# ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు : మక్తల్‌లో సీఎం

(సమయం ప్రతినిధి – మక్తల్): మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు.కృష్ణా , భీమా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు లకు మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంక లు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి,మంత్రులు వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి ఇరిగేషన్ అధికారులు వివరించారు. తర్వాత మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాట్రేవుపల్లి లో నిర్మిస్తున్న





పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా జూరాల ప్రాజెక్టును పరిశీలిస్తూ గద్వాల జిల్లాలోని గోల్డెన్ దొడ్డి రిజర్వాయర్ పరిశీలనకు వెళ్లిపోయారు అక్కడ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధికారులు సీఎంకు నీటిపారుదల ఆవశ్యకతను మొరపెట్టుకున్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు మాజీ ఎమ్మెల్యే సంపత్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి సరిత తో పాటు ఎంపీ మల్లురవి మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి వాకిటి శ్రీహరి ఇన్చార్జి మంత్రి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాల అమలు

హైదరాబాద్, (సమయం ప్రతినిధి : విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాల అమలు, డ్రైవర్లకు తగిన శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ ఎన్. వాణి సూచించారు. విద్యార్థుల సురక్షిత రవాణా పాఠశాల యాజమాన్యాలు, వాహన యజమానులు, డ్రైవర్ల సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.మోటారు వాహనాల చట్టం–1988 ప్రకారం ప్రతి రవాణా వాహనం చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను రహదారులపై నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. పాఠశాల బస్సుల్లో అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరం, ప్రథమ చికిత్స పెట్టె, జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, స్పీడ్ గవర్నర్, సీసీ కెమెరాలు తదితర భద్రతా సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం కలిగి ఉండాలని, రహదారి భద్రత, రక్షణాత్మక డ్రైవింగ్, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి అంశాలపై వారికి నిరంతర శిక్షణ అందించాలని సూచించారు. పాఠశాల యాజమాన్యాలు వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, బీమా పత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు తదితర పత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల రవాణా భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.
నిబంధనలను ఉల్లంఘించే వాహన యజమానులు, నిర్వాహకులపై రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని డాక్టర్ ఎన్. వాణి స్పష్టం చేశారు.







OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085